గటాక్షించినట్లు చెప్పఁబడిన పార్వతీపరమేశ్వరుల చరిత్రము – వేదోక్తమగు నభిప్రాయముకంటెవేఱయి యున్నది. అది – భక్తానుగ్రహము కొఱకుఁ గావింపబడిన యొకానొక లీల. కావున నదియు సత్యమేయని నిశ్చయింపనగును.

**ప్రభ** :- హిమాచల క్షేత్ర నివాసులగు పార్వతీపరమేశ్వరులు – తేజోమయదేహులనియు, సూక్ష్మదృగ్గోచరులనియు గ్రహించునది.

**అవ** :- ప్రథమస్తబకము నుపసంహరించుచున్నాఁడు.

మూ॥ ఏతాసామార్యాణాం జానన్తః శాస్త్రసమ్మతం భావమ్।
జానీయుర్భవమహిషీం భువనానామమ్బికాం దేవీమ్ ॥ 25

గీ. శాస్త్రసమ్మతముగ సమకూర్పఁబడిన, ఆ
ర్యాశయము నెఱుఁగునట్టి బుధులు
భవుని మహిషియగుచు భువనంబులకు నెల్ల
నంబయయిన దేవి నరయఁగలరు.

వేదాదిశాస్త్ర సమ్మతమగుతీరున, ఆర్యాశయమును ( ఆర్యావృత్తము లందలివియు, ఆర్యులవియునగు అభిప్రాయమును) తెలిసికొనిన విద్వాంసులు – భవానియు జగన్మాతయు నగు నుమాదేవత యొక్క స్వరూపమును గ్రహింపగల్గుదురు.

**ప్రభ** :- ఆర్యాశయమనఁగా, ( ఆర్య + ఆశయము) పెద్దల యభిప్రాయము, అనియు, ( ఆర్యా + ఆశయము) ఆర్యావృత్తముల యభిప్రాయము, అనియు నర్థము. ఈ యర్థము – తెలుఁగుపద్యమునఁ గూడ నుపపన్న మగుచున్నదని యెఱుంగునది.

ఇది సవ్యాఖ్యమగు ప్రథమస్తబకము

* * * *



ఓమ్ శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః
శ్రీ సరస్వతీ దేవ్యై నమః
ఓమ్ నమోభగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ప్రథమ శతకమునందలి ద్వితీయ స్తబకము)

**అవ** :- మొదట శతకమునందున్న – ఈ ద్వితీయస్తబకమున – ఈశ్వర–శక్తులకుఁ గల భేదాభేదస్వరూపమును, అన్యోన్యసంబంధమును, సమయభేద కథన ద్వారమున ప్రతిపాదించుచున్నాఁడు. మఱియు నిందే సంక్షేపరీతిని సృష్టి ప్రకారమును నిరూపించి, అధ్యాత్మ – అధి దైవత – విచారము చేతను, త్రిమూర్తి – పంచమూర్తి – సిద్ధాంతోప పాదనము చేతను, కవికిష్ట దేవతయు మహాశక్తియునగు ఉమ– ప్రస్తుతింపఁబడుచున్నది.

మూ॥ సహోదరేణ యో వలక్ష పారిజాతమాలయా
గలస్థలీ విభూషయా ధ్వనిం వినైవ భాషతే।
మహేశపుణ్యయోషితో మనోజ్ఞ హాస ఏష, మే
విభూతయే ప్రకల్పతాం విధూతయేచ పాప్మనామ్॥ 1

మ. గళము నలంకరించి సితకాంతియుతంబగు పారిజాతపు
ష్ప లలితమాలతోఁ జెలిమి శబ్దము లేకయె మాటలాడుచున్
వెలయు మహేశపుణ్యసతి నిర్మలహాసము, మా విభూతికిన్
గలుషవిధూతికిన్ ప్రబల – కారణమై మముఁ బ్రోచుఁగావుత్

**ఆంధ్రానువాదము** :- కంఠాభరణమై ప్రకాశించుచు, శుభ్రమగు (తెల్లని) వర్ణముఁ గలిగియున్న పారిజాత పుష్పమాలతోఁ గూడి ఆదరము గలిగి

ధ్వనిలేకుండునట్లు సంభాషించుచున్న మహేశ్వరుని పుణ్యస్త్రీయగు నుమాదేవత యొుక్క మనోజ్ఞ (నిర్మల) మగు హాసము నాయైశ్వర్యమునకును, పాపధ్వంసమునకును, కారణమై నన్ను రక్షించుగాక!

**ప్రభ** :- (విశేషార్థము) పారిజాతమాల - తెల్లనిది. ఉమాహాసము గూడ తెల్లనిదే. ఇట్లీరెంటికిని గల సావర్ణ్యము వలన మైత్రి సిద్ధించుచున్నది. కావున హాసము పారిజాతమాలతో రహస్యభాషణమొనర్చుట సంగతమగుచున్నది.

ఆ హాసముయొక్క కాంతి విలాసము వక్షస్థల విశ్రాంతమును, శుభ్రమును, కంఠాలంకారమును, అగు పారిజాతమాల_యొుక్క ప్రాంతములయందు వ్యాపించుచున్నది. ఆహాస విలాసమే నిశ్శబ్దభాషణము - పారిజాతమాలయందు మా హాసమునకు గల యాదరమౌచిత్య పోషకమగుచున్నది.

పుణ్య శబ్దమునకు సౌందర్యమనియు, సుకృతమనియు, రెండర్థములు గలవు. కావున పుణ్యవతియన 'సుందర స్త్రీ' యనియు, పుణ్యమే యగు స్త్రీ యనియు నర్థద్వయము సిద్ధించుచున్నది.

కావుననే కొందఱు ఈశ్వరుని పుణ్య (తపః) ఫలము - 'ఉమ', అనియు, ఉమయొుక్క పుణ్య (తపః) ఫలము 'ఈశ్వరుఁడు' అనియుఁ జెప్పుచున్నారు.

ఈ విషయమే అలంకారిక శిరోమణియగు జయదేవునిచే నిట్లు చెప్పఁబడినది.

'పరస్పరతపః సమ్పత్ఫలాయిత పరస్పరౌ.
ప్రపఞ్చ మాతాపితరౌ ప్రాఞ్చౌ జాయాపతీ స్తుమః' అని.

హాసమునకును పారిజాతమాలకును గల అనురూప్యము (అనురూపత) వలన నిది సమాలంకారమగునని తెలియునది.

**అవ** :- తిరుగ పాపఫల ప్రధ్వంసమును జేయుమని ప్రార్థించుచున్నాఁడు.



మూ॥ నిరన్తరశ్రితే సదా కృపారస ప్రవాహినీ
విలాసినీ తనుర్విభోః పుమాకృతేర్విమోహినీ।
సుధాతరఙ్గ కల్పహాస భాసురాననా శివా
పదాబ్జలమ్బినో ధునోతు పాప్మనః ఫలం మమ॥ 2

చ. అనవరతశ్రితుండగు నరాగ్రణియందు కృపారసప్రవా
హిని, పురుషాకృతిన్ గొనుమహేశుని మోహితుఁజేయు సద్విలా
సిని, అమృతోర్మి సుస్మితరుచిప్రచురాస్య, శివస్వరూప - సద్
వనజవిలంబి మద్ఘటిత పాప ఫలమ్ము నడంచుఁ గావుతన్

శివయగు పరాశక్తి - తన్నెల్లప్పుడు నాశ్రయించు భక్తుని యందు కృపామృతమును ప్రవహింపఁజేయును. ఆమె పురుషాకృతి యగు నీశ్వరుని విమోహవంతునిగాఁ జేయునదియగు విలాసినివంటి శరీరమును గలిగియున్నది. అమృతతరంగమయములగు హాసాంశువుల చేత భాసమానమగు చంద్రునివంటి ముఖము గలిగియున్నది. నేనామె పదపద్మములందుఁబడి వ్రేలాడుచున్నాను. కావున నామె నాపాప ఫలమును ధ్వంసము చేయుగాత!

**ప్రభ** :- ఒక్కతియే యగు శివ నిట్లనేక విధముల నుల్లేకించుటచే ఇందలి యలంకార ముల్లేఖమని యెఱుంగునది.

**అవ** :- సృష్ట్యాది విధాత్రియు, అంతటను ప్రకాశించుచున్నదియు, అగుచున్నను గూడ, గురుప్రసాదము లేకుండిన యెడల, విద్వాంసులు గూడ నామె నెఱుంగుటకు శక్తులు గానేరరని చెప్పుచున్నాఁడు.

మూ॥ కరోతి యా బిభర్తి యా నిహన్తియా జగత్త్రయమ్
సమన్తతో విభాతి యా న దృశ్యతే క్వచిచ్చ యా।
అతీవగుప్తరూపిణీ, గురూపదేశమన్తరా
న శక్యతే బుధైశ్చ బోద్ధుమన్ధకారిసున్దరీ॥ 3

ఉ.  ఎవతె జగత్ త్రయంబుస్సృజియించి, భరించి, హరించుచుండుఁదా,
నెవతె సమస్తమందును రహించియు నెందును గానుపింప; దా,
శివసతి, గుప్తరూపిణి - ప్రసిద్ధ గురూక్తి లభింపకుండినన్
వివృత నిజస్వరూపయగునే భువినెంతటి బోధశాలికిన్.

అంధకుఁడను రాక్షసునకు శత్రువగు శివుని యొక్క సుందరియగు పరాశక్తి - ఈ ముల్లోకములను - సృష్టించి, భరించి, సంహరించుచుండును. ఆమె ప్రకాశింపని స్థలము లేదు. అట్లయినను, ఎక్కడనుగూడఁ గనఁబడకున్నది.

ఆమె మిక్కిలి సూక్ష్మమగురూపము గలది. కావున మన స్థూల చక్షువులకుఁ గనఁబడకున్నది. గురూపదేశము వలన నేమహాత్ముల యంతర్నేత్రమున్మీలితమగునో వారికే కనఁబడును. **ఆ గురూపదేశము లేకుండ నెంత పండితులును గూడ నామెను జూడఁజాలరు.**

**ప్రభ:**- 'మహేశ్వరునితోఁ గూడినశక్తియగు నుమయే - సృష్టిస్థితిలయ కర్త్రి' అని భావము.

**అవ:**- భూతములను (ప్రాణులను) మేల్కొల్పుట, మున్నగు పనులను - ఆ దేవతయే చేయుచున్నదని చెప్పుచున్నాఁడు.

మూ॥  మహాన్ధకార బన్ధురస్య భూతసఞ్చయస్య యా
విని(ద్రితస్య సర్వబీజధామ్ని మౌనముద్రితే ।
సమస్తతో విజృమ్భణాయ భాసనాయచాభవన్
మహద్విధాయ చేష్టితం మమేయ మిష్టదేవతా॥  4

ఉ.  మౌనవిముద్రితంబగు సమస్త చరాచరబీజధామ; మ
చ్చో నిబిడాంధకారగతిఁజొొచ్చి వినిద్రితమౌ జగద్గత
ప్రాణిచయంబు మేల్కొలిపి స్వక్రియల్ జరిపించుసత్ క్రియన్
బూనుమదిష్ట దేవతఁ బ్రభూత మహేశ్వర శక్తిఁ గొల్చెదన్.



సర్వలోకములకును కారణావస్థానిధానభూతమగు స్థానమును, పరమ పురుషశరీర భూతమునునగు సూక్ష్మాకాశము సర్వలయావస్థ యందు నిశ్శబ్దస్థితి చేత నిశ్చలమైయుండును. అట్టి సూక్ష్మాకాశమునందు - ఆ లయావస్థయందు ఈ ప్రాణివర్గమంతయు (వినిద్రితమై) నిశ్చేష్టమై, మహాంధకార బంధురమై యుండును. ఇట్లు వెలుతురు లేకుండుట చేత - విభజన, పని, ప్రకాశము లేక విషయమై యున్న యీ జగజ్జీవరాశి నంతటిని జగన్మాతయే (విజృంభింపఁజేసి), మేల్కొల్పి, తమతమ పనులను జేయించును. ఈ మహాకార్యమును గావించుటకు శక్తిగలిగి యున్న మహాశక్తియగు నుమాదేవతయే - నాయిష్ట దేవత. కాని కేవలమును పురాణప్రసిద్ధములగు దేశ - కాల - పరిచ్ఛిన్నాకార - చరిత్రములు గల పార్వతీమూర్తి మాత్రమే - నా యిష్టదేవత కాదు. ఆమెనే నేను సేవించెదను.

ప్రభ :- మౌనముద్రితము = నాదాతీతాక్షర - నైశ్చల్యరూపమగు నిశ్శబ్దము చేత మూతపెట్టఁబడినది.

ఇందలి యభిప్రాయము నిట్లెఱుంగునది.

'ఉమ ఒకానొక దేశమునందు - ఒక కాలము నందు - ఒకయల్పమగు దివ్యసుందర విగ్రహము గలిగిన దేవత' అని పురాణములు వాకొనుచున్నవి. ఏతత్కవి కిష్టదేవతయగు నుమ - అట్టి పరిచ్ఛిన్న స్వరూపిణికాదు. ఆమె అఖండ స్వరూపిణి. కదలునవియు, కదలనివియు, నగు వస్తువుల కుపాదానకారణమగు సూక్ష్మాకాశము - సృష్టికి పూర్వము మౌనముద్ర వహించినట్లుండును. చరాచరమగు నీ ప్రపంచమంతయు అందు నిద్రించుచున్నట్లుండును. అప్పుడీయుమ - దానిని విజృంభింపఁజేసి, వానివాని పనులయందుఁ బ్రవేశింపఁజేయును. ఈ మహాకార్యమును జేయు మహాశక్తియగు నుమయే - ఏతత్కవి సంభావిత, హిమవంతుని కొమరితయగు పార్వతిమాత్రమే ఉమకాదు.

**అవ :**- మహాశక్తి యొక్క ప్రథమ చేష్టితమును స్తుతించుచున్నాఁడు.

మూ॥ మహేశగర్భతః సమస్తభూత బీజకోశతః
కిరన్త్య శేషవిశ్వమప్యపార దివ్యవైభవా।
విచిత్ర చేష్ట యాద్యయా విధూతనాథనిద్రయా
జగన్నుతా జయత్యసావనాదిశక్తి రద్భుతా ॥ 5

మ. సముదంచజ్జడ జీవబీజమయ కోశం బైన సర్వేశు గ
ర్భమునందుండి - సమస్తలోకముల నుత్పాదింపనిద్రాయుతుఁ
రమణుఁ మేల్కొనఁజేయు చిత్రమగుచర్యన్ దొల్తఁగావించె, ది
వ్య మహా వైభవ యాదిశక్తి - త్రిజగత్ ప్రఖ్యాతయాశ్చర్యయై

చరాచరవస్తు సమస్త బీజ విధానమగు సూక్ష్మాకాశమే – మహేశ్వర గర్భము. అనాది మహాశక్తి – జడది – జీవోపాదాన సామగ్రికోశమగు మహేశ్వరుని గర్భము నుండి జగజ్జాలమును వెలువరించి, విక్షేపించుటకు, యోగనిద్రయందున్న తన భర్తయగు నామహేశ్వరుని మొదట తానే మేల్కొల్పుచున్నది. అత్యద్భుతమగు నీ చేష్టచేత అపారమును దివ్యమునునగు వైభవము గల యామహాశక్తి – జగన్నుతయై వెలయుచున్నది.

**ప్రభ** :- వివరణము :– సమస్తభూత బీజకోశము = 'భవన్తి' ఇతిభూతాని అనువ్యుత్పత్తి చేత పుట్టిన వస్తువులన్నియును భూతములని చెప్పఁబడును. బీజములనగా వస్తువులు పుట్టుటకు కారణములగు విత్తనములు, కోశమనఁగా; ఆ విత్తనములుంచఁబడిన కట్ట. (పెట్టె) ఈ విత్తనముల కట్టయగు సూక్ష్మాకాశమే మహేశ్వర గర్భము.

**తాత్పర్యము** :- ఈశ్వరుడు 'యోగనిద్రనుండి మేల్కొనని యెడల నీశ్వరికీ విశ్వమును విక్షేపించుటకు = విరియఁజిమ్ముటకు – శక్తి కలుగదు. కావున నాయమ్మ. అసాధ్యమును ఆశ్చర్యమునగు నిజచేష్టచే నాపరమేశ్వరుని మేల్కొల్పుచు మన కాశ్చర్యకారిణి యగుచున్నది. ఇట్లు సమాధినుండి మేల్కొలుపఁబడిన యీశ్వరుఁడే – ఈ యీశ్వరికీ ప్రపంచ సృష్టి విధానము ననుగ్రహించుచున్నాఁడని యెఱుంగునది.



**అవ** :- ఇప్పుడు – శ్లోకద్వయముచే శివ, శక్తుల నామ భేదముల కుపపత్తిని జూపుచు, వారికిఁ గల భేదాభేదసంబంధమును బ్రదర్శించుచున్నాఁడు.

మూ॥ భవం భణన్తితాన్త్రికాస్త్వదాశ్రయం తమవ్యయం
సమామనన్తి వైదికాః సదర్చితే ! సదాహ్వయమ్।
నకశ్చిదర్థభేద ఏత దాఖ్యయోర్ద్వయోర్భవే
ద్వి దేయమాదిమం పదం పుమాన్పరం నపుంసకమ్॥ 6

మ. 'వ్యయశూన్యుండు త్వదాశ్రయుండు భవుడన్ వా, రాగ మజ్ఞుల్, సదా
హ్వాయుఁ డాతండను వారు వైదికులు, భిన్నార్థంబు లేదిందొకిం
తయు, ఈ రెండు సమాఖ్యలంగలది సత్తార్థంబెయౌ, నీ పద
ద్వయమందున్నది పుంసపుంసక విభేదం బొక్కటే, సన్నుతా.

సజ్జన పూజితవగు నోజననీ ! నీకాశ్రయుఁడును – అవినాశియును = వినాశము (వ్యయము) లేనివాఁడును అగుపురుషుని భవుఁడని చెప్పుదురు.

నీకాధారమగు నా పురుషుని – వైదికులు 'సత్తు' అను పేరుగల వానినిగాఁ జెప్పుదురు. 'భూసత్తాయామ్' అను నిర్వచనము చేత 'ఉండుట' అను నర్థముగల భూధాతువు నుండి పుట్టిన 'భవ' పదమునకును, 'అస – భువి' – అను నిర్వచనము చేత 'ఉండుట' అను నర్థము గల అస్ ధాతువునుండి పుట్టిన సత్ పదమునకును నర్థభేదమేమియును లేదు. కాని యొక్క భేదము మాత్రమున్నది.

అది యేదనగా, సంస్కృతమునందు మొదటిదగు 'భవుఁడు' (భవః) అను పదము పుంలింగము, రెండవదగు 'సత్తు' (సత్) అనుపదము నపుంసకలింగము.

ప్రభ :– ఆంధ్రభాషయందు 'భవుఁడు' అనునది – మహద్వాచకము. 'సత్తు' అనుపదము – అమహద్వాచకమును అగునని యెఱుంగునది.

అవ :– అతఁడు – భవుఁడు. నీవు – భవానివి, అతఁడు – సత్తు. నీవు – సతివి' అనుచున్నాఁడు.

మూ॥ సచేద్భవో౽భిధానతో, భవాన్యసిత్వమవ్యయే!
సమీర్యతే స సద్యది త్వ మమ్బ! భణ్యసే సతీ।
సతే౽స్తి భావతాన, శక్తి రూపిణీ హి విద్యసే
న వేద్మి కాలికే! కథం సతో౽సతశ్చ భిద్యసే॥ 7

మ. భవుఁడాతండయినన్ భవానివగుదంబా! నీవు, దేవుండు, స
త్తవునేనిన్ సతివౌదువీ, వునికిలేదా నీకు? సత్యస్వరూ
పవు నీ, వెల్లెడ శక్తిరూపవగుచున్ వర్ధిల్లుచున్నావు, నిన్
కవివర్యుల్ సదసద్ విలక్షణవనన్ భావింపలేనవ్యయా!

అవినాశినివగు నోకాళికా! పరమేశ్వరుని నామము భవుండయిన యెడల నీ నామము భవాని యగుచుండును. అతఁడు 'సత్తు' యిన యెడల నీవు సతివగుదువు నీకు – స్థితి – లేకుండుట లేదు నీవున్న దానవే. నీవు – సర్వమునందును శక్తి రూపిణివై యున్నావు. శక్తి స్వరూపము – సత్తు ( ఉన్నది) గాక, అసత్తు (లేనిది) గాక, విలక్షణమై యున్నదని కొందఱు చెప్పుదురు. అది యెట్లు సంభవమో నేను గ్రహింపలేకున్నాను.

**ప్రభ** :-వేదాంతులు – మాయాశక్తిని – ఉన్నదికాదు. లేనిదికాదు. అని చెప్పుదురు.

శక్తి రూపిణివగు నీకు – ఉనికికలదు. లేమిలేదు. కావున నీవు – సదసద్ విలక్షణవని చెప్పుట యెట్టిదో నేనూహింపజాలకున్నానని తాత్పర్యము. భగవంతుఁడగు ( ఆచార్యుఁడగు) రమణమహర్షి –

'' అచలస్యతుయచ్ఛక్తేశ్చలనం – లోకకారణమ్
తామే వాచక్షతే మయామనిర్వాచ్యాం విపశ్చితః॥''



''కదలికలేని పరబ్రహ్మమునకు సంబంధించిన – ఏ శక్తి యొక్క చలనము లోకములకు కారణమో, ఆ శక్తినే – అనిర్వచనీయయగు మాయయని వేదాంతులు చెప్పుదురు.'' అని రమణగీతయందు ప్రవచించియున్నాఁడు.

**అవ** :- ఈ ప్రపంచమునకు మూలము – 'అసత్తు' అనికొందఱును, 'చితి' అని కొందఱును, ' ఆనందము' అని కొందఱును చెప్పుదురు. ఇట్లు బహువిధములుగాఁ జెప్పబడుచున్న తల్లి – ఈ యుమాశక్తి యొక్క తెయేయని చెప్పుచున్నాఁడు.

మూ. జగద్విధాన కార్యతః పురాసురాసురస్తుతే!
త్వ మమ్బ! జీవితం భవస్య భావమూలవాదినామ్।
వికల్ప వర్జితామతిః ప్రబోధమూలవాదినాం
రసో౽నపేక్ష ఉత్తమః ప్రమోదమూలవాదినామ్॥ 8

చం. అనఘ! జగద్విధానకృతి - కాదినభావమె మూలమన్ మతం
బున నగుదీవు జీవితము, (ప్రాణమవు) బోధమె- మూలముగా వచించుసన్
మునుల మతంబునన్' మతిని,' మోదమె - మూలముగా గ్రహించుత
త్త్వనిధి మతంబునం దపరతంత్ర మహారసరూప వంబికా.

దేవతల చేతను – రాక్షసుల చేతను బూజింపబడుచున్న దానవగు నోయమ్మా! విశ్వసృష్టి వ్యాపారమునకు ముందు ' ఏమియు లేదు' అను వారి మతమున నీవు జీవితమవై (ప్రాణమువై) యున్నావు. జగత్ కారణము చిత్ స్వరూపమను వారిమతమున నీవు చిత్తివై అనఁగా, వికల్పవర్జితమగు మతివై యున్నావు.

**ప్రభ** :- వివ :– 'అసతః', సదజాయత, అసత్తునుండి – సత్తు పుట్టెను 'అసద్వాఇదమగ్ర ఆసీత్' సృష్టికి పూర్వమిదియంతయు 'అసత్తే' అయియుండెను. ఇత్యాది మంత్రవర్ణోపనిషద్వాక్యములను – జగన్మూలము, అభావమే అని

తలంచువారు ఆధారములుగా స్వీకరించుచున్నారు. వారిమతమున నీ జగత్క్రియను గావించు పదార్థము – ప్రాణమను పర్యాయపదముగలదియు, క్రియలను జేయించునదియు నగు జీవితమే అగుచున్నది. ప్రాణములేనిదే యేదియుఁగూడ కదలదు గదా! చిత్ స్వరూపమగు సత్తే జగత్కారణమను వారి మతమున నీ శక్తి వికల్పరహితమగు మతి యుగుచున్నది. ప్రమోదమే జగన్మూలమను తత్త్వవేత్తల మతమున నీమెయే స్వతంత్రరసస్వరూపిణి. లోకమునందు – ఆనందప్రాప్తికి – కావ్యనాటకాదు లపేక్షింపఁబడుచున్నవి – ఈ యానందరసమట్లితరముల నపేక్షింపదని యెరుంగునది, అమ్మా ! నీవు, నిర్విషయమగు ఆనందమే స్వరూపముఁగాగల తల్లివి, అని భావము.

**అవ :-** ఈశ్వరుని పరచితి – భవాని, ఉమ, శివ, అను నామత్రయమునఁ జెప్పఁబడునని వాని నిర్వచనము నుగ్గడించుచున్నాఁడు.

మూ. భవత్యసావతో భవాన్యనాదిరన్త వర్జితా,
జగన్తిమాతి నిత్య మోరసౌ తదభ్యుధాయ్యుమా।
రసాత్మి కో శ్యతేఽఖిలై రసౌతతః శివోచ్యతే
పరైవ మీశితుశ్చితిస్త్రిధా యుధైరుదీర్యతే॥ 9

చం. ఒనరననాద్యనంత యగుచుండునుగాన 'భవాని' యయ్యొ
'ఉః' అన శివుఁడర్థము, అందొదవునట్టి జగంబుల 'మా' ఖ్యఁ గొల్చుటన్
జను ''నుమ'' నా, రసంబయివ శాహ్వయధాతుసముశ్యమానయై
తనరు 'శివాఖ్య' నిట్లు త్రివిధంబుగ తచ్చితి – సన్నుతంబగున్.

ఆది – అంతము లేకుండుట వలన (సత్ స్వరూపిణి యగుట వలన) ఈ మహాశక్తి 'భవతీతి భవానీ' – 'ఉన్నది కావున భవాని', అను వ్యుత్పత్తి చేత 'భవాని' అగుచున్నది.



'ఉ' అను శబ్దమునకు శివుఁడర్థమగును. కావున 'ఉ' పదవాచ్యుడగు శివునినుండి పుట్టుచున్న లోకములను 'మాతీతిమా' కొలుచునది యగు మానశక్తి అను వ్యుత్పత్తిచేత మహాశక్తియే – ఉమ యగుచున్నది.

ఉ= శివునియొక్క మా= మానశక్తి (పరిమాణశక్తి) కావున జగన్మాత – 'ఉమ', అని చెప్పఁబడును.

లోకులందఱిచేతను 'రసస్వరూపిణి' (ఆనందాత్మిక) అగు నీమె ఉశ్యమాన= కోరఁబడుచున్నది యగుచుండుట చేత 'శివ' అని చెప్పఁబడుచున్నది. 'వశకాన్తౌ' అనుటచేత కామమునందు వశధాతువు ప్రయోగింపఁబడును.

ఇట్లు కామార్థకమగు వశధాతువుచే గోరఁబడుచున్న ఆనంద స్వరూపిణి యగు మహాశక్తి – వశధాతువునందలి యక్షరముల మార్పు వలన 'శివ' అని చెప్పఁబడుచున్నది. 'వశ' అనునది స్వల్పమగు వర్ణ వ్యత్యయము చేత 'శివ' అని యగునుగదా!

ఇట్లీశ్వరుని పరచితి పండితులచేఁ త్రివిధముగాఁ జెప్పఁబడుచున్నది.

**ప్రభ :- వివ :-** అమేయుఁడగు = కొలుచుటకు (తెలిసికొనుటకు) శక్యము కానివాఁడగు, నీశ్వరునుండి పుట్టుచున్న యసంఖ్యాకములగు లోకములన్నియు నతని పరిమాణశక్తియగు మహాదేవిచే మితములు (కొలువఁబడినవి) అగుచున్నవని భావము.

**విశే :-** '' ఉమేతిమాత్రా తపసో నిషిద్ధా
పశ్చాదుమాఖ్యాం సుముఖీజగామ.''

అని కవికుల గురువగు కాళిదాస మహాకవి నిర్వచించెను. '' ఉ = అమ్మాయీ! మా = తపము చేయవద్దు' అని తల్లిచేఁ దపస్సునుండి నిషేధింపఁబడిన పిదప –పార్వతి– 'ఉమ' అను పేరునొందెను – అని దీని యర్థము.

ఈ నిర్వచనము మనోజ్ఞమేయైనను ఇది 'ఉమ' నొకవ్యక్తి విశేషమునుగా నిర్వచించి పరిమితమగుచున్నది. ప్రస్తుతమగు నిర్వచనమున ఆయుమ – అఖండ స్వరూపుఁడవు నీశ్వరుని మానశక్తియగుచున్నది. కావున ఈ నిర్వచనమ పరిమితమై యపూర్వమగుచున్నదని గ్రహించునది.

**అవ** :- ఈ పరచితియే – ఇంకొక విధమున ఇచ్ఛ, క్రియ, జ్ఞానము, అనుత్రయమును (త్రైవిధ్యమును) పొందుచుండుననుచున్నాఁడు.

మూ॥ చితిః పరైన కామనా రసేన కేనచిద్యుతా
చితిః పరైన సర్వదా౽ప్యనస్త్యజస్యతు క్రియా।
చితిః పరైవ గోచరావభాసికా మతిః స్మృతా
త్రిత్రైవ మన్యథాచితే శ్చిరన్తనై రుదీర్యతే॥ 10

చం. పరచితియే వచో౽విషయ భవ్యరసాన్వితయైన 'యిచ్ఛ' ఈ
పరచితియే – నిరంతరముఁ బ్రాణనముంబొనరించు 'కర్మ' ఈ
పరచితియే – జగద్విషయ భాసకమై వెలుఁగొందు జ్ఞాన, మీ
కరణిఁ జిరంతనుల్ త్రివిధగాఁ జితిఁదెల్పుదురన్యపద్ధతిన్.

పరాత్పర శక్తియగు చితి – అనిర్వచనీయ రసాన్వితయగు ఇచ్ఛయు, ప్రాణనము నొనర్చునదియగు క్రియయు, ప్రపంచ విషయములను భాసింపఁ జేయునదియగు మతియు, అగుచు త్రివిధముగానున్నట్లు కొందఱు చెప్పుదురు.

**ప్రభ** :- ఈ పరచితియే – 'అనిర్వచనీయము' అనఁగా అనుభవముచేఁ దెలియదగినదియేగాని 'అట్టిది, ఇట్టిది' అని తెలుపుటకు వీలులేనిది యగు నొకానొక యా నందరసముతోఁగూడి – 'ఇచ్ఛ' అనిచెప్పఁబడుచున్నది. ఆనందము వలన నగు నిచ్ఛచేతనే (కామనచేతనే) సృష్టి (వస్తు విసర్జనము) సంభవించుచున్నది. కావుననే సృష్టికి ముందు 'సోకామయత' 'అతఁడు కామించెను' అనుమాట వినఁబడుచున్నది.



అజుఁడగు పరమేశ్వరునికి సంబంధించిన పరచితియే నిత్యమును ప్రాణన (ప్ర+ అనన= బాగుగా ఊపిరితీయుట అను) వ్యాపారమును జేయుచు 'క్రియ' అని చెప్పఁబడుచున్నది. ఈ సృష్టికి ముందుఁగూడ పురుషుఁడు ప్రాణన మొనర్చుచునే యుండెను. ఆ ప్రాణనము – చిద్ వ్యాపారమే. ఇందులకు ప్రమాణముగా 'అనీదవాతం స్వధయా తదేకమ్' అని మంత్రవర్ణమొకటి గలదు. ఏకమగు నాసత్తు – సృష్టికి పూర్వము వాయువు లేకుండుట వలన, శ్వసితసాధనమగు వాయువునపేక్షింపకయే, రసరూపమగు స్వధచే నుపలక్షితయై శ్వసనము నొనర్చునదయ్యెను.' అని దీని యర్థము.

( ఇట్లు – ఇచ్ఛారూపిణియు – క్రియా రూపిణియునగు పరచితిని దెలిపి – జ్ఞానాత్మికయగు నామెను దెలుపుచున్నాఁడు) '' ఈ పరచితియే – శబ్దాది విషయములను ప్రకాశింపఁజేయుచు, మతి (జ్ఞానము) అని చెప్పఁబడుచున్నది.''

ఇట్లు బహుకాలమునుండియు వృద్ధులగు విజ్ఞులు – పరచితియొక్క త్రితను (త్రిప్రకారత్వమును) పూర్వోక్తముకంటె భిన్నమగు విధమునఁ జెప్పుచున్నారు.

**విశే**:- భోగేచ్ఛా విషయ భూతమగు రసముతోఁగూడిన శక్తి – ఇచ్ఛ, ప్రాణన వ్యాపారమునొనర్చు శక్తి – క్రియ, విషయప్రకాశిక యగు శక్తి – జ్ఞానము, లేక మతి, అని చెప్పఁబడుచున్నది.

కడచిన శ్లోకమున నీచితి – భవాని, ఉమ, శివ, అని త్రివిధముగాఁ జెప్పఁబడినది. ఇందు – ఇచ్ఛ, క్రియ, మతి, అని చెప్పఁబడినది'' అని యెఱుఁగునది.

**అవ** :- ఈశ్వరశక్తియగు ఉమాదేవి – వానికంటె వేరుకాదు. అట్లయినను ఈశ్వరునికంటె నామె వేరుగా నెట్లుగాన్పించునదియుఁ దెలియఁజేయుచున్నాఁడు.

మూ॥ చికీర్షత ప్రభౌజ్వలత్ త్వదీయ కీలసన్తతే
ర్వికీర్ణ ధూమజాలమేత దమ్బరస్థలం తతమ్।
విసృష్టితః పురాఽసి యాశివప్రభుత్వ రూపిణీ
పృథక్ ప్రభుశ్చలక్షితాఽ సిసా సవిత్రి! పుష్కరే॥ 11

మం. తతమౌ నీగగనస్థలంబును - జ్వలత్ త్వత్కీల విక్షిప్తధూ
మతుల ద్రవ్యముఁజేయు - నీశ్వరుఁడు; సంభావింప; సృష్ట్యాది
యం దతులాభిన్న విభుత్వరూపవగు నీ వాసృష్టివేళన్ పృథగ్
గితియైవెల్గు ప్రభుత్వమూనెదు తదాకాశంబునం దంబికా !॥

ఓ జగజ్జనయిత్రీ ! నీవీసృష్టి జరుగకముందు – ఈశ్వరునికంటె భిన్నురాలవుకాక, అభిన్నమగు ప్రభుత్వమును గల్గియుండెడిదానవు. ఆ యీశ్వరుడు – సర్వవ్యాప్తమగు నీయాకాశమున నీజ్వాలామాల నుండి చిమ్మఁబడినపొగ వంటిదయి, మిక్కిలి సూక్ష్మమగు తనయందలి కారణద్రవ్యమును – ఎప్పుడు విక్షేపింపఁగోరెనో, అప్పుడు నీవు ఆ యీశ్వరునుండి విడివడి సృష్ట్యధారమగు నాయాకాశమున వేఱొక ప్రభ్వివలె కాన్పింపఁజొచ్చితివి. ఆశ్చర్యము గదా !

ప్రభ :- వివ :- సృష్టికి ముందు పురుషుని కంటె వేఱుకాని ప్రభుత్వరూపముతో నున్న శక్తి – సృష్టి ప్రవర్తింపఁబడుచున్నపుడు ప్రత్యేక ప్రభ్వియై ప్రకాశింపఁజొచ్చెనని భావము.

అవ :- కావ్యభాషచేత – సృష్టి పద్ధతి నిరూపించుచు, మొదట నక్షత్ర మండల విధానమును దెలుపుచున్నాఁడు.

మూ॥ పునర్విపాకతో ఘనీభవద్భిరక్షిగోచరై
స్తతస్తతః సముజ్జ్వలైః స్వసూక్ష్మ రేణుగోలకైః।
అజాణ్డవృక్ష కోటి కన్దబృన్దవద్ వ్యధాః పురా
మహేశదృష్టిమయ్యుమేఽ మ్బుమణ్డలాని భాస్వతామ్ 12



మ. అతిసూక్ష్మాకృతి ధూమకల్పములు ద్రవ్యంబుల్ పునఃపాకసం
గతిచే మారిఘనీభవించి - క్రమతన్ - గాన్పించి- భాసిల్ల - ద
క్షత, సూక్ష్మాంబరరేణు గోళముల, భాస్వన్మండలంబుల్ సృజిం
చి, తజాండాగమకంద బృందమువలెన్ శ్రీ శాంకరేశామయీ! 12

పరమేశ్వర సంకల్పమయివగు నో పరమేశ్వరీ:– (పూర్వోక్తములగు) ధూమ సదృశములగు సూక్ష్మద్రవ్యములు – పరమేశ్వరునిచే విసర్జింపఁబడి, పాకవశమున గడ్డకట్టి, దృష్టిగోచరములయి, క్రమక్రమముగా పాక ప్రభావమున చక్కగాఁ బ్రకాశించుచు, ఆకాశమునందగు సూక్ష్మ రేణుగోళము లగుచున్నవి. గోళాకారములగు నాపిండముల చేత నీవు (సమర్థతతో) భాస్వన్మండలములను అనఁగా, సూర్యమండలములను, లేక దీప్తివంతములగు నక్షత్రమండలమును, రచించుచున్నావు. అమండలములు – బ్రహ్మాండములనెడి వృక్షకోటులకు మూలాంశములగు కందబృందముల (దుంపల) వలె నున్నవి.

ప్రభ :- సూర్యమండలములే మిక్కిలి దూరస్థితి వలన నక్షత్రముల వలెఁ గాన్పించుననునది కవికభిమతమని ఏతద్ వ్యాఖ్యాత – (కపాలి) సాక్ష్యము నిచ్చుచున్నాడు.

వృక్షకోటులకు – కందబృందముల వలె, బ్రహ్మాండకోటులకు మూలములగు మండలములను – ఆకాశమునందు నక్షత్రాకారమున నిర్మించితివని తాత్పర్యము. బహుగ్రహాత్మకమగు నొక్కొక్క సూర్యకుటుంబమునకును తత్తత్కుటుంబమూల భూతుఁడు – ఒక్కొక్క సూర్యుఁడేయగును – కావున వృక్షమునకు కందమువలె ప్రతిబ్రహ్మాండమునకును సూర్యుఁడే మూలమని నిరూపింపఁబడినది.

ఈక్ష = దృష్టియే (తలంపే) సృష్టినిమిత్తమని ఔపనిషదులు (వేదాంతులు) అందురు.,

ఆయాశ – జగన్నిమిత్తకారణమగు నీశ్వరతపశ్శక్తి యని యింతకు ముందు చెప్పఁబడినది. కావున 'మహేశదృష్టిమయీ,' (శాంకరేక్షామయీ) అను సంబోధనము – కుదురుచున్నది.

**అవ** :- ఛాందోగ్యోపనిషత్ ప్రతిపాదితమగు తేజో, జలాన్నమయమగు సృష్టినుద్దేశించి – స్వాభిప్రాయమును దెలుపుచున్నాఁడు. తైత్తిరీయకులు – ఆకాశప్రభృతి పంచభూత సిద్ధాంతవాదులు, ఛందోగులు, ఈ సృష్టిని – తేజస్సు – జలము – అన్నము – అను త్రిధాతురూపముగాఁ దెలియుచున్నారు. ఆచార్యుఁడగు నీకవికి ద్వితీయమిష్టము' తేజశ్శబ్దము – ప్రకాశకత్వగుణకమగు ద్రవ్యవిశేషమును, అప్ఛబ్దము – క్షరణధర్మకమును, ద్రుతిశీలమునునగు ద్రవ్య విశేషమును అన్న శబ్దము – పార్థివమగు ఘన ద్రవ్యమును బోధించునని యెఱుంగునది.

మూ. తపోఽగ్ని ధూమజాలకే భవన్తి తైజసాణవో
భవన్తి జీవనాణవో, భవన్తి పార్థివాణవః।
క్రమేణ తద్విసృష్టి రీశశక్తి పాకవైభవే।
సహస్రభాను మండలంతు గోచరాది గృహ్యతామ్. 13

చం. మొదటఁ దపోఽగ్ని ధూమతతిఁబుట్టినభంబునఁ దైజసాణువుల్
పిదప జలాణువుల్ గలుగు – పిమ్మట నేర్పడు బార్థివాణు సం
పద, పరమేశశక్తి పరిపాకమహత్త్వమె- తద్విసృష్టికిన్
మొదలగు, సూర్యమండలమె – మూలము గోచరమస్తు కోటికిన్.

సృష్ట్యాదియందు – అగ్నినుండి – పొగవలె సంకల్ప రూపమగు తపశ్శక్తి వలన – ఆకాశ క్షేత్రమున తైజసములగు (తేజస్సంబంధులగు) నణువులు పుట్టుచున్నవి. అవి మిగుల సూక్ష్మములు, తరువాత (వానినుండి) జాలాణువులు జనించుచున్నవి. తదుపరి పార్థివములగు (భూసం బంధులగు) అణువులుద్భవించుచున్నవి.



పరమేశ్వర తపశ్శక్తి పరిపాక ప్రభావములననే యివన్నియుఁ గ్రమముగాఁ బుట్టుచున్నవి. (వనకు) ప్రత్యక్షములగు వస్తువులకు మూలము – సూర్యమండలమేయని గ్రహింపవలయును.

**అవ** :- కుజాదులగు గ్రహములు – సూర్యమండలము నుండియే యుద్భవించునను నాశయమున – సూర్యమండలము – ప్రత్యక్ష విషయమూలమని పేర్కొనఁబడియెను, ఆయంశమును గ్రిందిశ్లోకముచేఁ దెలుపుచున్నాఁడు.

మూ॥ మయూఖమాలి మణ్డలే నిధాయపాదము గ్రయా
మయూఖ శక్తి రూపయా త్వయాఽమ్బ! చేష్టమానయా।
ఖకోశతః సమాహృతైః పునస్త్రిరూప రేణుభిః
వ్యధాయి మఙ్గలాదిభిః సహగ్రహైరియం మహీ॥ 14

ఉ. ఉగ్రవు, చేష్టమానవు, మయూఖ సముజ్జ్వల శక్తివై, క్రియా
వ్యగ్రత, సూర్యమండలమునం దొకపాదమునుంచి – సన్మహా
నుగ్రహవై, ఖకోశముననుండి త్రిరేణువులూది. తత్కుజా
దిగ్రహయుక్తగా వసుమతిన్ సృజియించితి వంబికేశ్వరీ

సూర్యమండలమునం దతితీవ్రమగు వ్యాపారము నొనరించుచు- తత్ కిరణశక్తి రూపవగు నీవు – ఆసూర్య మండలము నందొక పాదము, (భాగము) నుంచి – ఆకాశకోశమునుండి తేజోజలాన్న రూపములగు ( ఉపాదాన ద్రవ్యములగు) నణువులను తిరుగ సంగ్రహించి, వానిచేత కుజాదిగ్రహములతోఁ గూడ నీ భూలోకమును సృష్టించితివి.

**ప్రభ** :- సూర్యమండలమున పాదమును నిక్షేపించుట మహానుగ్రహమై యున్నది. తత్పాదనిక్షేపము చేత సూర్యద్వారమున గ్రహోత్పత్తి చెప్పఁబడినదగుచున్నది.

సత్యమును విచారించునెడల - ఇచ్చటఁజెప్పఁబడిన పాదశబ్దము - అంశమును బోధించునని తెలియనగును.' ఈ ప్రపంచసృష్టి ఉమయొక్క ఏకాంశము చేత జరుపఁబడియెనని తెలుపుటకు 'ఒకపాదమునుంచి' అని ప్రయోగింపఁబడినది.

'ఈ ప్రపంచసృష్టి పరమేశ్వరుని యందొకభాగమే' అను నంశము - 'పాదోస్య విశ్వాభూతాని త్రిపాదస్యామృతందివి' అను వేదమంత్రము తెలుపుచున్నది గదా!

**అవ** :- భూలోకసృష్టిని దెలిపిన పిదప చంద్రమండల సృష్టిని జెప్పుచున్నాఁడు.

మూ॥ విసర్జనేన భూపసాఽపి దేవ్యతృప్తయేయతా
విచేష్టితం విలక్షణం పునర్వ్యధీయతత్వయా।
ఇహాన్తరే వసున్ధరా - మయూఖమాలి బిమ్బయో
రముష్య కర్మణః సవిత్రి! చన్ద్రమణ్డలం ఫలమ్॥ 15

ఉ. ఇంతమహా "విసృష్టి" ఘటియించియుఁ దృప్తి వహింపకంబ! అ
త్యంత విలక్షణంబయిన యద్భుతకృతిం దిరుగంబొనర్చి, తీ
వెంతయు వింతగల్గ జనియించె, ధరా - హరిదశ్వమండలా
భ్యంతర సంస్థితంబగు సుధాకరబింబము తత్ఫలంబుగన్.

అమ్మా! ఉమాదేవీ! నీవింత విస్తారమగు సృష్టిని గావించితివి. కాని నీకు తృప్తి కలిగినది కాదు. కావుననే తిరుగ అసాధారణమగు నొకానొకకార్యము నొనర్చితివి.

భూమండల - సూర్యమండలముల నడుమనున్న చంద్రమండలము దానిఫలమే గదా!

**ప్రభ** :- **వివ**:- ఈశ్వరుఁడు తనయందుండి యేవస్తువునైనను విసర్జించుట, (విడుచుట) యే సృష్టియని చెప్పఁబడును, ఈ సృష్టియే ప్రాచీనుల భాషయందు 'విసృష్టి' అని చెప్పఁబడును.



'ఇయం విసృష్టి, ర్యత అబభూవ' అని వేదమంత్రము చెప్పుచున్నదిగదా!

**అవ** :- ఈశ్వరులు, లీలాస్వీకృత స్త్రీ, పురుషాకారులగుటను దెలుపుచున్నాఁడు.

మూ॥ వధూ - పుమాకృతితో బభూవధుర్యువాంశివే
త్వమీశ్వరశ్చ లీలయా విహర్తు మత్రవిష్టపే,।
అహో! ప్రభుం నభస్తనుం త్వదీయగర్భ సమ్భవాద్
భణన్తి కాలి! తత్రచిత్రభాషణాస్త్వ దాత్మజమ్॥ 16

శా. ఈవున్నీ విభుండున్, శుభాకృతులఁ దల్లీ స్త్రీపుమాకారులై
రావెన్క్ జగమెల్ల లీలగ విహారాసక్తి వర్తింప, నా
హా? విశ్వేశు నభస్తనున్ - సుతుఁడు నీకౌనండ్రు చిత్రోక్తి వి
ద్యావేత్తల్ - భవదీయ గర్భజనియై - ఆదిత్యునం దుండుటన్.

ఓ కాళీమాతా ! తరువాత - నీవును, నీ భర్తయగు నీశ్వరుఁడును, ఈ లోకమున లీలావిహారము నొనర్చుటకు - భౌతికములగు నీకరచరణాద్యవయవములు గలవారలు కాక, దివ్యమంగళములగు స్త్రీ పురుషాకారములను ధరించిరి.

ఆకాశశరీరుఁడగు నీశ్వరుని చిత్రభాషణులగు పండితులు - నీ కుమారుఁడని చెప్పుచున్నారు. పురుషాకారుఁడగు నీశ్వరుఁడు - ఆదిత్య మండలాంతర్గత హిరణ్మయపురుషుఁడేయగును. మహాశక్తియే - అదితియని చెప్పఁబడుచున్నది. అదితివగు నీయందుండి జన్మించిన ఆదిత్యునందున్న వాఁడగుచున్నాఁడు, కావుననీశ్వరుఁడు - నీకొమరుడగుట ఉపపన్నమే యగుచున్నది.

**ప్రభ** :- మహాకాశశరీరుఁడగు సర్వేశ్వరుఁడు నీపుత్రుఁడగుట కుదురకున్నను, ఆదిత్యరూపుఁడగు నతఁడు - నీ పుత్రుఁడగుట - యుక్తమేగదా!

**అవ** :- హిరణ్మయుఁడగు పురుషుని జెప్పుచున్నాఁడు.

మూ॥ పుమానథో స బిమ్బితో హిరణ్మయోదివాకరే
ధియాஉపి నైవ కేవలం హిరణ్మయేన వర్ష్మణా,।
ఇదంతు కార్యరూపమన్య దుచ్యతే బుధైః ప్రభో
రిహాన్తరే నృణాం పునర్వపుస్తదమ్బ బిమ్బితమ్. 17

చం. రవిగతమౌ పుమాకృతి - హిరణ్మయుఁ, డాతనిధీ - హిరణ్మయం
బవును, హిరణ్మయంబెయగు నాతనివిగ్రహ, మంబ! కార్యరూ
ప విలసితంబు తత్ప్రభు సువర్ణశరీరము వేరొకండు - మా
నవ హృదయస్థలంబుల పునః ప్రతిబింబితమండ్రు కోవిదుల్.

శ్రుతులయందు ఆదిత్యమండల మధ్యవర్తియగు పురుషుఁడు గానము చేయఁబడుచున్నాడు గదా । ఆ పురుషుఁడు హిరణ్మయమగు నాకారముగల వాఁడగుచున్నాఁడు. అతని శరీరము కూడ - హిరణ్మయమే. అతనిజ్ఞానము కూడ - హిరణ్మయమే యగుచున్నది. కార్యరూపమున విరాజిల్లు దేయగు సువర్ణమయ శరీరమింకొకటి - మానవహృదయములయందు - మరల ప్రతిబింబితమగుచున్నది.

**ప్రభ :-** రూపమునను - శరీరమును - మాత్రమే గాక జ్ఞానమునఁగూడ - సూర్యమండలాతర్గతుండగు పురుషుఁడు హిరణ్మయుఁడే యనిభావము. అది - మనకు పరిచితమగు భౌతికాకృతికంటె వేఱగు - దివ్య సువర్ణమయాకారమని యెఱుంగునది.

యాస్కుఁడు - హిరణ్మయమనఁగా హితరమణీయమని నిర్వచించెను. దివ్యమగు నాకారము - హిత - రమణీయమే యగును గావున యాస్కనిరుక్తి కూడ - ప్రస్తుతోక్తిని బాధించునది కానేరదు.

సవితృమండల మధ్యవర్తియు - బ్రహ్మాండ మధ్యవర్తియు, కారణపురుషుఁడును - అగు నీశ్వరుని కార్యరూపమగు శరీరము (సువర్ణమయమగు



శరీరము వేరొకటి - మనుష్యహృదయములయందు తిరుగప్రతిబింబితమగుచున్నదని పండితులందురు. కారణరూపుఁడగు హిరణ్మయ పురుషుని తైజసమగు శరీరము - మనుష్య హృదయమున ప్రాప్తాకారమగుచుండునని భావము.

మనుష్యహృదయ స్థిత హిరణ్మయ పురుష స్వరూపజ్ఞానము. 'దహరవిద్య' అని చెప్పఁబడును. ఈ విద్యయే - సర్వవిద్యలలోపలను ప్రధానమగు విద్యయని యుపనిషత్తులు వాకొనుచున్నవి.

''మధ్యే వామనమాసీనం విశ్వే దేవా ఉపాసతే'' అని హృదయస్థితుఁడగు పురుషుని శ్రుతి ప్రతిపాదించుచున్నదిగదా!

**అవ :-** పురుషునితోఁగూడి అతని శక్తి కూడ బింబితయే యగుచుండునను చున్నాఁడు.

మూ॥ స్వయం చ కాఞ్చన ప్రకాశవర్ష్మణా ప్రభాకరే
తథాన్తరేஉ నృణాం చతస్య బిమ్బితాసి సన్నిధౌ।
రసస్య దేవతాసి దేవి పుష్కరే దివాకరే
మయూఖ దేవతాஉసి భోగ దేవతాసి దేహిషు. 18

గీ. దివ్య హేమ ప్రభాపూర్ణ దేహవగుచు
విభుని సన్నిధినెల్ల బింబించుచుందు
వర్కబింబమ్మునందు, నియ్యఖిల మనుజ
హృదులయందును, స్వయముగా నీవుదేవి!

ఆ. అంతరిక్షమున రసాధి దేవత, వుష్ణ
రశ్మిమండలమున రశ్మి దేవ
తవు, మనుష్యహృదయ ధామంబుల - మహేశ
తరుణి! భోగ దేవతవు గదమ్మ.

జగన్మాతవగు దేవీ! నీవు స్వయముగాఁ గూడ మహేశ్వర సన్నిధియందుండునదియగు హిరణ్మయ ప్రకాశ దేహముతోఁగూడి - సూర్యమండలమునందును, మనుష్య హృదయములందును గూడ ప్రతిబింబిచున్నావు. ఈ భూలోక - సూర్యలోకముల నడుమనున్న భువర్లోకమున (అంతరిక్షమున) రసాధి దేవతవై (చంద్రకలారూపిణివై) యున్నావు, సూర్యలోకమున, నిత్యజీవనాధారమగు వేడిని ప్రసరింపఁజేయు కిరణ దేవతవై యున్నావు. మనుష్య హృదయములయందు, భోగ దేవతవై యున్నావు.

**ప్రభ** :- ''సోమోభూత్వా రసాత్మకః'' అని గీతయందు చంద్రకళారూపిణి యగు ఉమాదేవతయే - తెలుపఁబడెను.

తాంత్రికులు గూడ 'నిత్యచంద్రకల' అగు శ్రీ విద్య నుపాసించుచున్నారు. స్వర్లోకమున (సూర్యునియందు) విశ్వజీవనాధారభూతమగు వేడిమిని (ఎండను) ప్రకాశింపఁజేయుచున్న కిరణదేవత ఉమాదేవతయే.

భూలోకమునందు - అస్మదాదులగు ప్రాణులయందు భోక్తృత్వసామర్థ్యమతోఁగూడిన అగ్ని శక్తి స్వరూపిణియయి భోగదేవతయై జ్వలించుచున్న శక్తి ఉమయే.

రసమును వేరొక పేరుగలవాఁడును, అమృతస్వరూపుఁడును, అగుసోముఁడు - భోగ్యమును, అగ్ని - భోక్తయునగు ననునంశము శ్రుతిప్రసిద్ధము.

'సోమోవా' అన్నం, అగ్నిరన్నాదః' అని బ్రాహ్మణము - చెప్పుచున్నది గదా!

పృథివి:- అగ్ని దేవతాకము, కావున భూలోకనివాసుల కధ్యాత్మమగు నగ్ని - భోక్తయగుననునది యుపపన్నమగుచున్నది.

**అవ**:- సోమ, సూర్య, అగ్ని, శక్తి దేవతామయియు, త్రిలోక వ్యాపారయునగు మహాదేవి నిట్లుగ్గడించి - ఆయీశ్వరునితోఁగూడ నీయీశ్వరి- తిరుగ మనుష్యలోక - పితృలోక - దేవలోకములయం దెట్లుండునదియు వివరించుచున్నాడు.



మూ॥ విసర్జనేన భూయసా నభస్యముత్ర భాస్కరే
మహీషుచామ్బికే యువాం విధాయ దేహినో బహూన్।
క్షితేః సుధాకరంగతాన్ పిత్ర్యాన్ వినేతు మవ్యయే।
తనూచ తత్రబభ్రథుః ప్రపఞ్చరాజ్ఞి! మాయయా! 19

శా. ఆకాశంబున సూర్యునం, దవనులందంబా! మహాసృష్టి మీ
రాకల్పింతు రనేక దేహులను దేవాది స్వరూపంబులన్।
లోకాధీశ్వరి! భూమినుండి పితరుల్ శుభ్రాంశుఁజేరంగ, త
ల్లోకంబేల విభిన్న దేహముల దాల్తుర్ మీరే మాయాగతిన్!

ఓ ప్రపంచ రాజ్ఞీ! అంతరిక్షమగు భువర్లోకము నందును, సూర్యలోకమునందును, భూలోకములయందును, మాతాపితరులగు మీరిద్దఱును మహత్తరమగు సృష్టిచే నాయాలోకములకు ఉచితములగు జీవరాసులనుగాని దేవసమూహములనుగాని పుట్టించుచున్నారు. మఱియు భూలోకము నుండిమృతులై ధూమాది మార్గము చేత చంద్రలోకమునకు వెళ్ళిన పితృదేవతలను శాసించుటకు మీరే మాయచే వేర్వేరుగా లీలా శరీరములను ధరించియున్నారు.

**ప్రభ**:- భూలోకములు మూడని 'తిస్రః పృథివ్యః' అనుమంత్రము చెప్పుచున్నది. 'మహీషు' 'భూములందు' అనుపదముచేత, కుజాదిగ్రహములు బోధింపఁబడుననియైనను గ్రహింపఁదగును. వేదము - భూములనేకములని చెప్పుచున్నది గదా!

**అవ** :- భూలోక - భువర్లోక - స్వర్లోకముల కధిష్ఠానమై ప్రకాశించు పురుషమూర్తి భేదమును త్రిమూర్తివాదుల యభిప్రాయము ననుసరించి చెప్పుచున్నాఁడు.

మూ. సభోఽన్తరే హిరణ్మయం విభుం ప్రచక్షతే హరమ్
దినేశబిమ్బ బిమ్బితం భణన్తి పఙ్కజాసనమ్।
ఇహాస్మదన్త రాలయం వదన్తి విష్ణుమచ్యుతమ్
సవిత్రి! జన్మనామియం 'త్రిమూర్తి' వాది ధోరణి ॥ 20

మ. కవిలోకంబు - హిరణ్మయాంగు విభునాకాశాంతరంబందహో
శివుఁడంచున్, రవిబింబబింబితు సుర జ్యేష్ఠాహ్వయుండంచు, మా
నవహృద్దేశని వాసు నచ్యుతుని విష్ణ్వాఖ్యుండటంచున్, పురా
ణవిధిన్ బూను త్రిమూర్తి వాదిమతమున్ భాషించు సర్వేశ్వరీ !

ఓ ప్రాణిలోక జననీ! అంతరిక్షమధ్యమందు – ఆయాకాశము కంటెను గూడ సూక్ష్మమగు స్వరూపముచే వ్యాపించియున్న దివ్య సౌవర్ణ జ్యోతీ రూపుఁడగు పురుషుని – హరుఁ (శివుఁ) డనియు, సూర్యమండల మధ్యవర్తియగు పురుషుని – బ్రహ్మయనియు, భూలోకమున ప్రాణి కోటుల మగు మా హృదయముల నాశ్రయించి నాశరహితుఁడై యున్న పురుషుని 'విష్ణువు' అనియు, పౌరాణిక సంప్రదాయమునుడువుచున్నది.

**ప్రభ** :- ఇచటఁ జెప్పఁబడిన బ్రహ్మ – చతుర్ముఖ బ్రహ్మగాని, పరబ్రహ్మము కాదు.

**అవ**: ఇట్లు పురాణోక్తమగు మూర్తిత్రయమును దెలిపి, వేదాంతిమతము నుపపాదించుచున్నాఁడు.

మూ॥ నభోఽన్తర్తే ప్రచక్షతే హిరణ్మయాఙ్గ మీశ్వరమ్
దినేశ బిమ్బపూరుషం హిరణ్య గర్భమాఖ్యయా !
విరాజమానమక్షరం విరాజమన్తరే నృణాం
సవిత్రి! తత్త్వ వేదినామియంతు నామకల్పనా ॥ 21



ఉ. అంబరమందు హేమమయుఁడౌ ప్రభుఁడీశ్వరనాముఁ, డర్కబిం
బంబున బింబితుండయిన వానిసమాఖ్య - హిరణ్యగర్భుఁ, డో
యంబ! మనుష్యహృన్నిలయుఁ డక్షరమూర్తి - విరాట్టు, జ్ఞానరూ
పంబు నెఱుంగు తాత్త్వికులు - పల్కు విధమ్మిది - కాశికేశ్వరి!

ఓ జననీ! ఆకాశమధ్యమున దివ్యహిరణ్మయ శరీరుఁడగు పురుషుఁడు – ఈశ్వరుఁడను నామము గల వాఁడనియు, సవితృమండల మధ్యవర్తి యగు పురుషుఁడు హిరణ్య గర్భుఁడను – పేరు గల వాఁడనియు, ఇక్కడి జంతువులమగు మా హృదయములయందు విరాజిల్లుచున్న పురుషుఁడు– 'విరాట్టు' అనునాఖ్యగల వాఁడనియుఁ జెప్పు త్రిమూర్తివాదము – వేదాంతుల ( ఔపనిషదుల) చేతఁ దెలుపఁబడుచున్నది.

**ప్రభ** :- వివః– విరాడ్ఢిరణ్యగర్భేశ్వరులను పురుషులు ముప్వురును క్రమముగా మనుష్యహృదయ – ఆదిత్య – అంతరిక్షములయందున్నట్లు చెప్పఁబడుచున్నారని యెఱుంగునది.

అవ్యక్తమను మాయయందు ప్రతిబింబించిన బ్రహ్మ (చైతన్య) ము– ఈశ్వరుఁడనియు – మహత్తత్త్వమునందు ప్రతిబింబించిన బ్రహ్మము – హిరణ్య – గర్భుఁడనియు, అహంకారమునందు ప్రతిబింబించిన బ్రహ్మము – విరాట్టనియు జెప్పఁబడుననునది వేదాంతమతము.

**అవ** :- తరువాత ప్రాచీనమగు వైదికమతము ననుసరించి మూర్తిత్రయము నుపపాదించుచున్నాఁడు.

మూ॥ హిరణ్మయాఙ్గ మమ్బ రేవదన్తి సోమమమ్బికే!
దివాకరస్య మణ్డలేతు బిమ్బితం పురన్దరమ్ !
శరీరిణామిహాన్త రేఽగ్ని మాలపన్తి భాసురమ్
చిర న్తనోక్తి దర్శినామియం శివే ప్రణాళికా॥ 22

ఉ. అమ్మ! హిరణ్మయాంగుఁడగు నాతఁడు ''సోముఁ'' డటంచు, సూర్యబిం
బమ్మున బింబితుండయినవాఁడు ''పురందరు,'' డంచు, దేహిహృం
దమ్ము హృదంతరస్థితిఁ దనర్చెడు పూరుషుఁ డగ్నియంచు, మం
త్రమ్ములఁగన్న పూర్వుల మతమ్ము వచించు శివ స్వరూపిణీ!.

ఓయంబికా! ''అంతరిక్షమున (భువర్లోకమున) జ్యోతిర్మయుఁడగు పురుషుఁడు – సోముఁడు. సూర్యమండల బింబితుఁడగు పురుషుడు– పురందరుఁడు. శరీరధారులమగు మా హృదయములందు విరాజిల్లు పురుషుడు – అగ్ని.'' అని మంత్రద్రష్టలగు ప్రాచీన ఋషులమతము చెప్పుచున్నది.

**ప్రభ** :- 'యదద్యకచ్చ వృత్రహన్ ఉదగా అభిసూర్య సర్వం తదిన్ద్రతేవశే' అను వేదోక్తి చేత – ఇంద్రుఁడు– సూర్యాత్మకుఁడను నంశము ప్రసిద్ధమగుచున్నది. వెనుక ఏయేస్థలములందు – పురుషుఁడు – హిరణ్మయుఁడని చెప్పఁబడియెనో, ఆయాస్థలములం దెల్ల, అతఁడు, దివ్యజ్యోతిర్మయుఁడు' అనునర్థమును తెలియనది.'

**అవ** :- తదుపరి, పంచమూర్తి వాదిమతము నుపపాదించుచున్నాఁడు.

మూ॥ సరోరుహాక్ష వాగ్వధూ మనోహరౌతు పూర్వవత్
సుధాంశుబిమ్బ పూరుషస్తు రుద్రసంజ్ఞకః శివే।
హిరణ్మయోఽన్తరి క్షజాత ఈశ్వరః సదాశివః
సదేవవస్తు కాఞ్చనాఙ్గి! పఞ్చమూర్తి వాదినామ్॥ 23

చం. హరి నరులందు, బ్రహ్మరవియందును, రుద్రుఁడు – చంద్రునందు, ది
వ్యరుచి వెలుంగుచుందురు; తదంబరవర్తి – హిరణ్మయాంగుఁడీ
శ్వరుఁడు; సదాఖ్యవస్తువగు బ్రహ్మమె – దేవి సదాశివుడు, శై
వరచిత పంచమూర్తి శుభ వాదమునందు – హిరణ్మయోజ్జ్వలా!



సువర్ణాంగివగు జగజ్జననీ! బ్రహ్మ – విష్ణు – రుద్ర – మహేశ్వర (ఈశ్వర) సదాశివులను పంచమూర్తులు – శైవాగమములందును, శాక్తాగ మములయందును ప్రసిద్ధులగుచున్నారు.

తన్మతముననుసరించి – పూర్వోక్త ప్రకారమున విష్ణువు– మనుష్య హృదయములందును, బ్రహ్మ – (చతుర్ముఖుఁడు) సూర్యమండలము నందును, నివసించువారగుచున్నారు. సోమ మండలమునందుండు పురుషుఁడు – రుద్రుఁడగుచున్నాడు. అంతరిక్షజాతుఁడగు హిరణ్మయ పురుషుఁడు, పూర్వోక్తవిధమున నీశ్వరుఁడే (మహేశ్వరుఁడే) యగుచున్నాడు. సత్య వస్తువగు పరబ్రహ్మమే – సదాశివుఁడని చెప్పఁబడుచున్నాఁడు.

ఇదియే పంచమూర్తివాది సిద్ధాంతము.

**ప్రభ** :- భువర్లోకాధిష్ఠాతయు 'వ్యాపకుఁడును' అగు నీశ్వరుఁడే యిందు దెలుపబడిన మహేశ్వరుఁడని యెఱుంగునది.

**అవ**:- తదుపరి, ప్రథమ, ద్వితీయస్తబకములయందు ముఖ్యముగాఁ బ్రతిపాదింపఁబడిన మహేశ్వరియొక్క రూప షట్కమును క్రమముగాఁ దెలుపుచున్నాఁడు.

మూ॥ ప్రభోః ప్రమాఽఽదిత, స్తతః ప్రమావతీ స్వయం పృథగ్
విహాయసా శరీరిణి ప్రభా తతో హిరణ్మయే
హిరణ్మయాఙ్గనాకృతిర్నభోఽన్తరేచ భాస్కరే
తథాఽన్తరేషు దేహినాం మహేశ్వరీ జయత్యుమా॥ 24

శా. ఆదిన్ - తత్త్వమవై, అనంతరము వేత్తై, చిత్ సమన్వీతవై,
మీదన్ వ్యోమమువై, హిరణ్మయుని స్వామింగూడి - స్వర్ణోజ్జ్వల
శ్రీ దేహంబున నంతరిక్ష సరణిన్ జెల్వొంది; జీవాత్మలం
దాదిత్యాత్మనియందుమాఖ్యవగునిన్ ధ్యానింతు సర్వేశ్వరీ!

పరశక్తియగు మహేశ్వరికి సృష్టికిముందున్న రూపములు మూఁడనియు - తరువాతివి - మూఁడనియు నెఱుంగునది.

ఈపర దేవత - మొట్ట మొదట - పురుషునిప్రమయై, అనఁగా చిత్ స్వరూపయై ఉన్నది. అప్పుడీపురుషుని విడిచియుండక తదభిన్నయై యుండినది. అటుపిమ్మట, ఆ పురుషునికంటె, వేఱయి - సర్గ నిమిత్త భూతమగు భిన్న స్వరూపమున - ప్రమావతియై, అనఁగా, చిత్ తపశ్శక్తి రూపిణియై యుండినది. ఈ రూపము - రెండవది.

తరువాత నీమె - ఆకాశమున శరీరవతియగుచున్నది. 'అదితి దక్షునకొదవె' అని ప్రథమస్తబకమునఁ జెప్పఁబడినదీమెయే. ఇది యీమె మూడవరూపము.

తదుపరి నీమె - భూలోక - భువర్లోక - స్వర్లోకముల మూడింటి నడుమను గల యాకాశమున హిరణ్మయుఁడగు పురుషునితోఁ దానును హిరణ్మయాంగనయై ప్రకాశించుచున్నది. ఇది - ఆ మహా దేవతయొక్క నాలుగవ రూపము.

పిదప సూర్యునియందును, ప్రాణుల హృదయములందును గూడ ఉమయై ప్రకాశించుచున్నది. ఇది - మహేశ్వరియొక్క రూపద్వయము.

ఇట్లీ సర్వేశ్వరి - రూపషట్కము చేత వెలయుచున్నది.

**అవ:** ద్వితీయ స్తబకము నుపసంహరించుచున్నాఁడు.



మూ॥ మదీయ మఞ్చికాఖిలస్య విష్టపస్య దుష్టధీ
ధవిష్ఠ పాదపఙ్కజా ధునోతు కష్టజాలకమ్।
ఇమేచకోమలైః పదైరమూల్య తల్పశాలిన
స్తదీయ మఞ్చరూపతాం భజన్తు పఞ్చచామరాః॥ 25

చం. అలఘు కృపాభిరామ, మహితాత్మ, దురాత్మదవిష్ఠదివ్యప
జ్జలజ, మదీయ కష్ట సముదాయము నెల్ల హరించుఁగావుతన్!
లలితపదాలి తల్పసమలంకృతముల్, ప్రియ పంచచామరం
బు లివియు - మంచరూపమును బొంది - మహేశ్వరిఁగొల్చుగావుతన్.

(లలితపద + ఆలి + తల్ప+ సమలంకృతముల్ = సుందరములగు నంకములుగల శయ్యవలె కోమలవగు పదపంక్తి గల కావ్యశయ్యచే నలంకరింపఁబడినవి) సకల ప్రపంచమాతయగు నంబిక యొక్క పాద పద్మములు - దుర్బుద్ధులకు దుర్లభములు, ఆజగన్మాత - నా కష్ట సముదాయమును దొలగించును గాత!

కోమలములగు (లలితములగు) కళలచేఁ జిత్రింపఁబడి యంకముల చేత (గుర్తులచేత) రచింపబడిన శయ్యవలె, కోమలములగు (సరల వర్ణములు గల) పదములచే రచింప బడిన శయ్య! (కావ్యశయ్య) చేత శోభించుచున్న పంచచామరములను పేరుగల వృత్తములచేఁ గూర్పఁబడిన యీ శ్లోకములు - ఆ మహేశ్వరికి మంచరూపములై యామెను సేవించునుగాత!

**ప్రభ** :- ఇందు **1** తల్పము (శయ్య) **2** పదములు - అనుపదములు రెండును శ్లిష్టార్థములు. తల్పము - ప్రక్క - లేక, కావ్యబంధ విశేషమగు శయ్య, పదములు - అంకములు- (పూవులు మొదలగు చిహ్నములు) లేక, వర్ణ సముదాయరూపములగు పదములు, కావ్యబంధవిశేషరూపమగు శయ్య - తల్ప స్థానీయమనియును, సరలవర్ణ సముదాయ నిర్మితములగు పదములు - లలితకలా చిత్రిత - అంకస్థానీయములనియు, గ్రహింపనది.

పురుష సహచరియగు మహేశ్వరికి, పతితోడి రహో విలసితము - పర్యంకమునందువలె, మదీయమగు పంచచామరస్తబకమునందుఁగూడనగు ననునంశమును ఇందలి మంచపదము ధ్వనింపఁజేయుచున్నది. ఈ పంచచామరస్తబకమునందంతటను ఈశ్వరోపన్యాసద్వారముననే ఈశ్వరి యొక్క స్వరూపము వివరింపబడుట వలనను, ఈశ్వరునికంటె వేరుగానున్నట్లు చెప్పఁబడినను, ఈశ్వరుని గూడి యే యుండినట్లు చెప్పుటవలనను, ఇందలి పంచచామరసముదాయము - మంచరూపముగా నారోపించఁబడుట - యౌచిత్య పోషకమే యగుచున్నది.

ఇందు - పదములు - పదములుగను (అంకములుగను) శయ్య - శయ్యగను, శ్లేషముచే నారోపింపఁబడినవి. పంచచామరములు - మంచముగా నారోపింపఁబడినవి, కావున నిందలి యలంకారము - శ్లేషోజ్జీవితమగు రూపకాలంకారమగుచున్నదని యెఱుంగునది.

ఇది 'సవ్యాఖ్యమగు ద్వితీయ స్తబకము.

* * * *



ఓమ్ శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః
శ్రీ సరస్వతీ దేవ్యై నమః
ఓమ్ నమో భగవతే శ్రీరమణాయ

# ఉమాసహస్రము

## (ప్రథమ శతకమునందలి తృతీయ స్తబకము)

**అవ** :- తృతీయమగు నీస్తబకమున - పురుష - శక్తులకు శరీరముకలదా, లేదా యను విషయమున వికల్ప భేదముల నుపన్యసించి వారిద్దఱును లీలావిగ్రహధరులని ప్రతిపాదించి కీర్తించుచున్నాఁడు.

మూ॥ శుభ్రస్మితలేశో మాతుర్మరుతాన్నః
అస్తస్తిమిరాణా మస్తం విదధాతు ॥ 1

(''ద్విరదగతి'' అనురగడ). అదె మరుజ్జనని శుభ - మృదుహాసలేశంబు
హృదులఁ జీకటులెల్ల - విదలించుఁగావుతను ॥

మరుత్తులకుఁ దల్లియగు శచీ దేవియొక్క శుచియగు మందహాసము (చిరునవ్వు) మాహృదయములయందున్న చీకటులను - (బహు విధములగు నజ్ఞానములను) తొలగింపఁ జేయును గావుత!

**ప్రభ**:- ఇంద్రుడు - మరుత్తులకుఁ దండ్రి, 'ఇంధతి' అనుధాతువునుండి యేర్పడుటవలన - ఇంద్రశబ్దమున కర్థము - పరమేశ్వరుఁడే యగుచున్నాఁడు.

కావున నింద్రశక్తి యగుశచీ దేవి - 'ఈశ్వరి' అగుచున్నది. ఆమెయే ఇంద్రాణి' అని కూడ చెప్పఁబడును.